తిరుకువారల ఇనుపగోడలు ?" అని ప్రశ్నిస్తాడు.

"జాత్యాహంకారము అటవిక తత్త్వము కాదా" అని అడుగుతూ అన్నిటికీ "ఎత్తైన సత్యాన్ని" (Higher Truth ?) చెప్ప బూనుకుంటాడు-

ఏ కులము వెన్నెలది ? తెమ్మెర
లెట్టి జాతికి చెంది నట్టివి.
అట్టి దేకద మానవత్వము"

అని బోధిస్తాడు. ఐకమత్యం స్వర్గ ధామ మేనని చెప్ప సంకించి-

మనుషులందరు అన్నదమ్ముల
మాదిరిగ జీవించ కల్గిన
మర్త్యలోకమె దివ్య పదవికి
మారుపేరై పరిమళించును"

అంటాడు "మానవుని దేవతగ మార్చెడు మార్గమును కనుగొనుటమిన్న" అని ప్రాప్యాన్నీ లక్ష్యాన్నీ జ్ఞాపకం చేస్తున్నాడు. గొప్ప "సంస్కార ధార" గల వాడీ కవి.

సూర్యుణ్ణి ఆదర్శంగా చూపెట్టుతూ "చెమటోడ్చని బాటసారి" అనీ- ఒకనాటికి సమ్మె చేయని కూలీడ"నీ అతణ్ణి ఉద్దేశించి అనడం రమ్యంగా లేదూ ?

తన ఎడద సందుల్లో కోటి నందనాలు గుబాళించడానికి ఒక్క "సురభిళ శబ్దము" "తరగెత్తిన చాలు" నట ! "భూదవమ్ము లతికినట్లు, పొంగిపింగి నందు''కొనడానికి-

'ఇరుగుండియలొక మాత్రపు
విరులై కలిసిన చాలు'నట !

పవిత్ర ప్రేమ మాత్రమంటే ఎంత ఆనందం కవికి, ప్రేమభావం సనాతన మైనా, గ్రథనంలో ఉంది నవ్యత ! గుండెలను పూలనుగా చేసికోడంలో సాధన అవసరం గదా !

శబ్దాల పరిమళాలు తెలిసికొని, భావాలనే రెక్కలు గట్టిన కవితాంబుధిలో మానవత్వాన్ని పైకి చేదుకొన్న- కళాజీవి: దివ్యత్వ సాధనకై పరితపించే సాధకుడూ, అయిన మా నారాయణ (భట్టుకు) రెడ్డికి అభ్యుదయ పరంపరాభివృద్ధిరస్తు !

[గుంటూరులోని సమ్మాన సభ కుద్దిష్టమైన ఉపన్యాసము]

స్కెచ్ :

# గానమాధురి

పర్వతాలు మూగబోయాయి. పాల పొంగులాంటి వెన్నెల స్పర్శతో యమునా నది పులకరిస్తూంది. ఉత్సాహంగా అలలను విసుర్తూ ముందు సాగిపోతోంది. నిశ్శబ్దం-రమ నిర్విరామంగా నాట్యం చేస్తోంది. గూడులోని దంపతులు సరస సల్లాపాలు సాగిస్తున్నారు.

అదేమిటి... ! ఇంత నీరవంగా నున్న ఈనిశి సమయంలో వీణానాదం! జిహ్వాపై అమృతము చిలికినట్లున్నదే.... స్వర్గద్వారముల కళ సోలిపోతున్నట్లున్నదే.... ఎక్కడిదీ నాదం.ఎవరిదీ నాదం....ఓహో అది వీణానాదం గాదు-అందెల లయ....కూని రాగ తరంగం....స్పష్టమవుతోంది. అదిగో ఎవరో కన్య.... !

నడుమునంటు ఆ కృష్ణకేశాలు. విశాల నేత్రాలు, ఆనేత్రాల్లో ఎంత కాంతి.... ఎంత ఆకర్షణ...., చిన్నినోరు....ఆహా.... ! అర్ధ నగ్నంగా....అతి కోమలంగా....ఓహో! ఏమా వయ్యారం.... ! ఏమా సోయగం!— పిడికెడు నడుము నంటిపెట్టుకున్న....ఓ- ఘటమా! నీవెంత పుణ్యంబొనరించితివో!!

ఎవరీ అంగన....? గోపికాంగన కాదు గదా....సందియమేల...ఆమెయే! యమునా తటిc కేగుచున్నట్లున్నది....ఎందులకు...? ప్రియుని అగమ నిరీక్షణకా .... వెన్నెల షికారుకా....ఏమిటీ? యమునా జలగ్రహణార్థమా....? అందులకేమైనc యింత రేయి యందా .... అదుదెంచుట....! అచ్చెరువాశ్రయించునే ?!!

జలంబుని దిగి వికసించిన కలువల చెంతనే.... అదిగో...ఘటమును జలముతో నింప వంగుచున్నది....ఏమి లావణ్యమా వంగుట. అవయవ నిమ్నోన్నతాలు అస్పష్టంగా అగుపడుచున్నవే....

హఠాత్తుగా- ఎటనుండియో ఎవరిదో వేణూగానం అహా! జడములందు చేతనం ప్రసరించిందా! మోడులు చిగురించినవా! వల్మీకములనుండి సర్పంబులు బయల్వెడలి నర్తించుచున్నవే! మేఘంబులున్న వర్షించెడి వేమోద్యుపణియా — మరెందులకీ ముకుళించిన పద్మములు వికసించుచున్నవి. ఏమిటీ వైచిత్ర్యం ...హరిణంబులు పరుగిడుచున్నవి....వృక్షములనుండి జంతుజాలం నిక్కిచూచున్నాయి....ఆ వేణుగానc మెంత మహిమాన్వితమో!

అదేమిటి....వంగుచున్న ఆగోపికాంగన ఘటాన్ని వదలి నిలబడిపోయిందే—పిచ్చియెత్తినదా....? మత్తెక్కినదా....? ఉన్మత్తయై ఒళ్ళు విరచుకొనుచున్నదా...కనులు మూతపడుచున్న....పరవశంతో సోలిపోతోంది....

ఆమె మృదుహస్తాలనుండి విడువడిన నిర్జలమైన ఘటము, అలలపై నూయల నూగుతూ కలువలతో దోబూచులాడ నారంభించింది—

కైలాసాచల సన్నిభంబగు ఆ గోపికాంగన కుచద్వయాగ్రముల పైని వలువ వైదొలగుటనైన గుర్తించకున్నదే! ఏమీ! సర్వస్వాన్ని మరచినట్లున్నది .... వేణుగాన మామెహృదయాన్ని కరిగించి... ఉన్మత్తగా నొనరించినది....

కరిగిన ఆమెహృదయము ఎటకో ప్రవహించుచున్నదే....సూదంటురాయివంటి ఆ వేణూగానము సమస్త ప్రాణికోటిని ఆకర్షించుకొనుచున్నది.

ఓహో !.... ప్రకృతినే మైమరుపు తున్నదే ఆ గాన మాధురి.... !!!

— సైబ